


# కూపస్థ మండూకం

వింధ్యవాసిని

"మనం నావెల్టీకోసం అనవసరమయిన రిస్క్ తీసుకుంటున్నామేమో అనిపిస్తోంది కాశ్యప్" అని, ఆ వేళ అయిదోసారి, నా అనుమానాన్ని వ్యక్తం చేశాను.

మీటర్ వెడల్పు, మూడు మీటర్ల పొడవు ఉన్న మైకాటాప్ వర్క్ టేబిల్‌కి ఒక చివర్న నేను, మరో చివర కాశ్యప్ కూర్చుని ఉన్నాం. టేబిల్ అంతా విడి కాయితాలు, డ్రాయింగ్ పేపర్ ముక్కలు, పెన్సిళ్లు, పెన్నులతో చిందర వందరగా ఉంది. పరిస్థితి ఇట్లా ఉంటేనే సీరియస్‌గా పని చేస్తున్న ఫీలింగ్ కలుగుతుంది కాశ్యప్‌కి. మూడేళ్లుగా అతనితో కలిసి పని చేయటం వల్ల నాకూ అదే అలవాటు అయిపోయింది.

సగం వేసిన స్కెచ్‌ని ముందుంచుకుని, బుర్రలో ఉన్న ఊహలకి రూపాన్ని ఎలా ఇవ్వాలా అని, ఫెన్సిల్ కొసతో, మెడ మీద జుట్టులో గీకుతూ, ఆలోచనల్లో మునిగిపోయిన కాశ్యప్, నా మాటలకి, ఇహలోకం లోకి వచ్చేడు.

"మై డియర్ మనోరమా! యూ ఆర్ మిస్‌టేకన్. 'నావెల్టీ' కోసం అని ఎవరన్నారు? 'రిజల్ట్స్, ప్రాఫిట్స్'—వే మనకీ, మన క్లయింటికీ కూడా కావలసింది. 'రిస్క్' అంటావా లాభం కోసం చేసే ఏ పని అయినా రిస్క్‌తో కూడుకునే ఉంటుంది, చూస్తుండు; ఈ కాంపెయిన్ ఎంత ఫెంటాస్టిక్ రిజల్ట్స్ ఇస్తుందో! తలచుకుంటేనే ఉత్సాహం వచ్చేస్తోంది నాకు" అంటూ జేబులోంచి, సిగరెట్ పాకెట్ బయటికి తీసాడు.

ఉత్సాహం కలిగినా, బాధ కలిగినా, సీరియస్‌గా ఆలోచించాల్సి వచ్చినా, సిగరెట్టు కాలుస్తాడు కాశ్యప్ (అంటే ఇవేవీ లేనప్పుడు కాల్చడని అర్థం కాదు!) అతని సహవాసం వల్ల, అయిన రెండో అలవాటు, పూర్తిగా

మీరు
పెళ్ళి చేసుకున్నారా?
ప్రేమించుకోబోతున్నారా?
ప్రేమించుకుని దూరమయ్యారా?

మీలో ప్రతి ఒక్కరికీ
మనోదర్పణం...

గిరిజా కళ్యాణం
నవలా రచయిత్రి
యద్దనపూడి
సులోచనా
రాణి
సరికొత్త నవల
ఋతువులు
నవ్వాయి
రూ.20/-

వెంటనే కొని చదవండి!

మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే
నవల కాబట్టి అరువు తెచ్చు
కోకండి! అరువు ఇవ్వకండి!
ఇది ఎమెస్కో వారి ఉవాచ!

ప్రతులకు:
ఆంధ్రప్రదేశ్
బుక్ డిస్ట్రిబ్యూటర్స్
3237, రాష్ట్రపతిరోడ్
సికిందరాబాద్-500003

# కూపస్థ మండూకం

సిగరెట్టు పొగతో నిండిన వాతావరణంలో పని చేసుకోవటం.

మారీ అండ్ టోనీ కంపెనీవారి ఎకౌంట్లు మా ఏజెన్సీకి వచ్చిన రోజు బాస్ మమ్మల్నిద్దర్నీ తన గదిలోకి పిలిచి కూచోబెట్టుకుని ప్రత్యేకంగా చెప్పారు. నెల రోజుల లోపున ఈ కంపెనీ ఏడ్ కాంపెయిన్‌కి, అవుట్‌లైన్స్ తయారు చేయండన్నారు. ఆ కంపెనీ గురించి ఆయన సేకరించిన వివరాలున్న ఫైల్‌ని మా హస్తగతం చేశారు.

ఒకరి తర్వాత ఒకరం ఫైలు తిరగేశాము. అకౌంట్ పెద్దదే. న్యూస్ పేపర్స్‌తోబాటు ముఖ్యంగా టి. వి. ని మీడియంగా ఉపయోగించే అవకాశాలు కన్పించాయి.

నిజానికి ఇంతకన్నా పెద్ద ఎకౌంట్స్ కూడా లోగడ ఎన్నో మా కంపెనీకి వచ్చాయి. అయినా ప్రత్యేకంగా ఈ కంపెనీ విషయంలో బాస్ ఎందుకో కొంచం నర్వస్‌గా, అసందిగ్ధంగా ఉన్నట్లు కన్పించారు.

కొంచం ఆలోచిస్తే కారణం తెలిసిపోయింది.

మారీ అండ్ టోనీ కం. కి, సిటీలో అరడజను టెయిలరింగ్, డ్రస్‌మేకర్ షాపులు, డజను బార్బర్ షాపులు ఉన్నాయి.

మా ఏజన్సీ క్లయింట్స్‌లో, కాస్మెటిక్స్ తయారుచేసేవారు, ఫర్నిషర్సు, రేడియో, టి. వి. కంపెనీలు ఇలా ఎన్నో రకాలు ఉన్నారు కానీ, ఇట్లా బార్బర్స్‌కీ, టెయిలర్స్‌కీ ఎప్పుడూ మేం 'ఏడ్ కాంపెయిన్' తయారు చేయలేదు. అంటే ఈ రంగంలో, మాకు ఏమాత్రం అనుభవం లేదన్నమాట.

బహుశా మా బాస్ అసందిగ్ధతకి కారణం ఇదే అయి ఉంటుంది – అనుకున్నాను.

ఒక శుభోదయాన, కాశ్యప్ తన మనసులో ఉన్న ఆలోచన నా ముందుంచాడు. 'రియాలిటీ' కోసం ఇంత దూరం వెళ్ళనక్కరలేదని చాలాసేపు వాదించాను కాశ్యప్‌తో. కానీ నా ఆర్గ్యుమెంట్స్ ఏవీ అతని పట్టుదల ముందు పనిచేయలేదు.

ఆఫీస్ విషయాలు బయట, బయటి విషయాలు ఆఫీస్‌లో, చర్చించటం కాశ్యప్ ఎప్పుడూ చేయడు. ఆఫీస్ దాటి బయటికి వెళితే చాలు, 'నా మాటే తనకి వేదవాక్కు' అన్నట్లుగా ప్రవర్తిస్తాడు. కానీ ఈ నాలుగ్గోడల మధ్య చేరిన తర్వాత ఆ పప్పులేం ఉడకవు. తన మనసులో ఆలోచనల్ని ఎలా నాకు చెబుతాడో, అదే విధంగా, నా అభిప్రాయాలని అతనూ శ్రద్ధగా వింటాడు. కానీ ఏ విషయంలో అయినా పట్టుదల పడితే మాత్రం, దాన్ని వదిలించటం నా తరం కాదు.

పోన్లే, ఇతని ఆలోచనల్తో బాస్ ఏకీభవించి నప్పుడు కదా, నేనెందుకు ఇప్పట్నించే దిగులు పడాలి అనుకున్నాను.

'కాంపెయిన్ అవుట్ లైన్స్' తీసుకుని ఇద్దరం ఆయన్ని కలుసుకున్నాం. వివరాలు చూడగానే, ఆయన ఆశ్చర్యానికి అవధుల్లేకుండా పోయాయి.

పరిస్థితి ఇలా ఉంటుందని కాశ్యప్‌కి తెలుసు. తన పాయింట్స్, ఆర్గ్యుమెంట్స్‌తో తయారుగా ఉన్నాడు.

ఈ కాంపెయిన్‌వల్ల బ్రహ్మాండమయిన ఫలితాలు పొందటం తప్పనిసరి అని నమ్మకంగా చెప్పాడు. బాధ్యత తనమీద పూర్తిగా ఉంచుకునేట్లు మాట్లాడాడు.

ఎట్లా అయితేనేం ఆయన్ని 'ఎస్' అనిపించాడు.

ఆ వేళనించి పని మొదపెట్టాము. కాపీ తయారుచేయటం నా పని. దానికి తగినట్లు, అరవయి సెకెండ్ల టి. వి. కమర్షియల్‌లో కనిపించాల్సిన ఫ్రేముల స్కెచెస్ తయారు చేసుకోవటం అతని పని

పూర్తి అయిన వాటిలో ఒక స్కెచ్‌ని, దానికి సరిపోయ్యే కాపీని పోల్చి చూసుకుంటూ, ''బాస్ అసలు అప్రూవ్ చేస్తారనుకోలేదు కాశ్యప్'' అన్నాను.

''పోన్లే, ఆయనకయినా నా మీద నమ్మకం ఉంది ...''

''ఛ! అది కాదు కాశ్యప్ ... నువ్వసలు నా భయాన్ని అర్థం చేసుకోవటం లేదు'' అన్నాను, అస్త్రసన్యాసం చేస్తున్న దానిలా చేతిలో ఉన్న బాల్‌పెన్ కింద పడేసి చేతులు ముడుచుకుని, కూర్చున్నాను.

''విన్నా. నీ భయాన్నీ కూడా అర్థం చేసుకున్నానుగానీ,ఇవాళ్టికి దుకాణం మూసేద్దాం పద యంగ్ లేడీ'' అంటూ లేచి, చేతులు రెండూ పైకెత్తి కొద్దిగా ఒళ్ళు విరుచుకుని. కోటు కోసం వెతుక్కుంటున్నాడు కాశ్యప్.

అది కుర్చీ కిందికి వెళ్ళి దాక్కున్నట్లుంది. తీసి అందించాను. అర నిముషంలో టేబిల్ మీదున్న కాయితాలన్నీ సర్ది ఖాళీ ఫైల్లో దూర్చేసి, బ్యాగ్ పుచ్చుకుని కాశ్యప్ వెంట బయటికి నడిచాను.

అవతల ఆఫీసులో మిగతా గదులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఏ అరగంట క్రితమో అంతా వెళ్ళి పోయుంటారు.

మధ్యాహ్నం పని హడావిడిలో భోజనం విషయం మర్చిపోయినందుకేమో బాగా ఆకలిగా ఉంది.

అందుకనే, పార్కింగ్ ప్లేస్‌లోంచి స్కూటర్ బయటికి తీస్తూ, ''ఊఁ ఏమిటి ప్రోగ్రాం ?'' అని కాశ్యప్ అడిగితే, ''ముందు ఏదయినా హోటల్‌కి. కడుపులో కాస్త ఇంధనం పడితే అప్పుడు చూడొచ్చు ఏం చేయాల్సింది'' అన్నాను.

చెరొక సమోసా, మసాలా దోశ తిని, కాఫీ

తాగిన తర్వాత అడిగాడు కాశ్యప్, "సినిమానా. షికారా ?" అని.

"రోజూ సినిమాలు షికార్లేమిటి ? నన్ను ఇంటి దగ్గర దింపెయ్ కాశ్యప్. నేను అమ్మకు చెప్పలేదు కూడా ఆలస్యం అవుతుందని"

"ఆలస్యం అయినా అమ్మ ఏమీ అనుకోర్లే నునూ ! ఆవిడికి తెలీదా ఏం నువు నావెంట ఉంటావని... అయినా ఈ సరదాలు ఎన్నాళ్ళు ? ఒచ్చే నెలలో మన పెళ్ళి అయిపోతే, ఆ పయిన ఇల్లు, సంసారం, వంట వార్పుల్లో పడిపోతే ఎలాగూ షికార్లు కుదరవు. కనీసం ఈ కొద్ది రోజులయినా ఎన్‌జాయ్ చెయ్యాలి రాణీ" అని చిన్నగా రహస్యం చెబుతున్నట్లుగా అన్నాడు కాశ్యప్.

ఆ మాటలు అంటున్నప్పుడు, నా చూపులకి అతి దగ్గరగా వచ్చిన అతని ముఖంలో కనిపించిన భావం, నన్నేం మాయ చేసిందో గానీ, "సరే పద సినిమాకే వెళదాం..." అన్నాను; మృదువుగా, అతని వేళ్ళ మధ్య నలుగుతున్న నా చేతిని తప్పించుకుని లేచి అతని వెంట అడుగులు వేశాను.

* * *

అనుకున్న రోజు రానే వచ్చింది. ఆవేళే మారీ అండ్ టోనీకం. వారి టి.వి, కమర్షియల్ షూటింగ్.

సిటీలో మంచి సెంటర్ అయిన, షూలే సర్కిల్‌లో, మారీ అండ్ టోనీ వారి బార్బర్ షాప్ ఒకటి, దానికి అనుకునే టెయిలరింగ్ షాప్ ఉన్నాయి. ఈ రెండు దుకాణాలు అత్యాధునిక మయిన అలంకారాలతో, వీధిన వెళ్ళే వారికి ఆకర్షణీయంగా, ఆహ్వానిస్తున్నట్లుగా కన్పిస్తాయి, ఈ రెండు దుకాణాల్లోనే ఇవాళ షూటింగ్ జరగాలి.

షూటింగ్ పదకొండు గంటలకి. కాశ్యప్ తన మోడల్ కోసం, పాత సిటీ డ్రెయినేజ్ బ్రిడ్జికి అవతల మురికివాడకి తొమ్మిదింటికి బయలుదేరి వెళ్ళాడు.

ఆ మనిషి — అతని పేరు జోగులట. ముప్పయేళ్ళు వయసుంటుంది. ప్రత్యేకించి ఒక పని అంటూ చేసే అలవాటు లేదు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారట. రోజంతా సోమరిగా ఏ ఫుట్‌పాత్ మీదో, చెట్టు నీడనో, గుడిసెలో కుక్కి మంచంలోనో పడుకుని నిద్రపోవటం, రాత్రికి భార్యని తన్ని ఆమెతెచ్చిన కూలి డబ్బులు లాక్కుని, పొట్టనింపుకోవటం, ఇంకా మిగిలితే చుక్కవేసుకోవటం ఇదీ అతని దినచర్య. ఓపిక, తీరిక ఉన్నరోజు, ఏ బస్టాండులోనో, చిన్నదో పెద్దదో ఒక్కటే ఒక జేబు కొట్టటం కూడా కద్దు. ఇవీ జోగులు గురించి కాశ్యప్ సేకరించిన వివరాలు.

"ఈ బ్రతుకేమిటోయ్. ఏదయినా పని చేసుకోరాధా ?" అని కాశ్యప్ అడిగితే, అదో పెద్ద జోక్ అయినట్లు, పకాపకా నవ్వేను, "నాకు పని ఇచ్చే పనికిమాలిన వెధవ ఎవరుంటారు సార్" అన్నాడట.

ఈ కమర్షియల్ కోసం రికార్డ్ చేసి ఉన్న టేప్ వేసుకుని వింటూ కూర్చున్నాను.

నా ముందర కాశ్యప్ తయారు చేసిన పన్నెండు స్కెచెస్ ఉన్నాయి. మొదటిది, బాగా జుట్టు, గెడ్డం పెరిగి మాసిన బట్టల్లో ఉన్న జోగులు అనే మనిషి. 'మారీ అండ్ టోనీ' వారి బార్బర్ షాపులో ప్రవేశిస్తున్నట్లున్న చిత్రం.

రెండవ దానిలో, 'మారీ అండ్ టోనీ' బార్బర్ జోగులుకి హేర్ కటింగ్, మూడవది షేవింగ్ చేస్తున్నట్లున్న చిత్రాలు.

నాలుగు, అత్యాధునికంగా ఉన్న స్నానాల గదిలో ఇద్దరు అటెండర్లు జోగులుకి స్నానం చేయిస్తున్న దృశ్యం. అయిదు కూడా దాదాపు అలాంటిదే.

చిన్న బెడ్ షీటు సైజులో ఉన్న పెద్ద టర్కిష్ టవలు చుట్టబెట్టుకుని జోగులు, 'మారీ అండ్ టోనీ' టెయిలర్ షాపులోకి వెళ్ళటం — ఇది ఆరో స్కెచ్.

అతన్ని అలాగే నిలుచోబెట్టి, టెయిలర్ ఒకరు అతని కొలతలు తీయటం. వేరు వేరు పోజుల్లో ఇవే రెండు చిత్రాలున్నాయి.

తొమ్మిదవ చిత్రంలో టెయిలర్ బట్టలు కత్తిరించటం. పదవది, వాటిని ఎలెక్ట్రికల్ స్యూయింగ్ మెషీన్‌లో కుట్టటం.

పదకొండవదాన్లో ఆ బట్టలని జోగులు ధరించటం. చివరిది, కొత్త గెటప్‌తో పూర్తిగా మారిపోయి, వేరే మనిషిలా కనిపిస్తున్న జోగులు క్లోజప్.

"ఇదుగో, ఇతను జోగులు. ఇవాళ ఇతను 'మారీ అండ్ టోనీ' వారి అతిథి. అతన్ని వారెలా సత్కరిస్తారో చూడండి..." టేప్‌లోంచి మాటలు వినిపిస్తున్నాయి.

"ఏమిటీ ఇంకా టేప్ వేసుకుని కూర్చున్నావా ? పద పోదాం" అని హడావిడిగా లోపలికొచ్చాడు కాశ్యప్.

"ఏదీ నీ మోడల్" అన్నాను ఆసక్తిగా. నేను జోగులుని ఇంతదాకా చూడలేదు.


"వచ్చాడు. బయట కార్లో ఉన్నాడుగానీ, నువ్ రెడీయేనా ?"

ఇద్దరం బయలుదేరాము. దార్లో అన్నాడు కాశ్యప్, "ఈ జోగులుగాణ్ణి పట్టుకొచ్చేసరికి తాతలు దిగొచ్చారు తెలుసా ? రాత్రి సారాయి ఎక్కువయిపోయింది కాబోలు కొట్టుదగ్గరే పడి నిద్రపోతున్నాడు. వాణ్ణి నిద్రలేపి, 'రావయ్యా పోదాం' అంటే, 'ఉండు సార్ !' మూతి కడుక్కుని కూస్త తయారయి వస్తాను' అని గునిశాడు. "ఏడ్చినట్లుంది, నువు సింగారం ఏమీ చేసుకోనక్కర్లేదు. నిన్ను తీసుకువెళ్ళేచోట అన్నీ చేస్తారుగానీ పదవోయ్ అని లాక్కొచ్చాము."

బయట ఆఫీసు పనుల కోసం స్టాఫ్ ఉపయోగించుకునే కారు, దాని వెనకాలే, మేనేజర్‌గారి కారు నిలుచుని ఉన్నాయి.

కార్లో ఉన్న. జోగులుని చూడటంలో నిమగ్నం అయి ఉన్న నేను, మేనేజర్‌గారు కార్లో కూర్చుని మా కోసమే ఎదురు చూస్తూండటం గమనించనేలేదు. కాశ్యప్ 'హలో' అని ఆయని విష్ చేసేదాకా.

కారు దగ్గరికి వెళ్ళేక, "నేనూ వస్తున్నా మీతోబాటు. ఎలా పిక్చరైజ్ చేస్తారో



చూస్తాను. నీ కాంపెయిన్ చాలా క్ర్యారెయస్‌గా ఉందోయ్'' అన్నారు బాస్ కాశ్యప్‌తో.

స్కెచెస్‌లో ఉన్న జోగులు రూపం, కాశ్యప్ ఊహా జీవితమే అనుకున్నాను. కానీ నిజంగా కూడా ఆ బొమ్మల్లో లాగే ఉన్నాడు అతను. కార్లో డ్రయివర్ పక్కన కూర్చుని బీడీ తాగుతున్నవాడల్లా దాన్ని విసిరేసి, తుపుక్కున ఉమ్మేసి, బుద్ధిమంతుడిలా కూర్చున్నాడు, మా రాకని గమనించి.

ఆ మనిషి మెడకిందిదాకా చిందరవందరగా పెరిగిన జుట్టు, ముఖంలో కళ్ళు, ముక్కు తప్ప ఇంకేవీ కన్పించే అవకాశం లేకుండా ఉన్న బవిరి గడ్డం, అప్పుడప్పుడు, మట్టి నిండుకున్న గోళ్ళతో అతను జుట్టులో గీరుకోవటం చూస్తే, ఈ మనిషి బార్బర్ వాడి ముఖం చూసి ఎన్ని సంవత్సరాలయిందో అనిపించక మానదు.

మాసి, దుమ్ముకొట్టుకొని, అక్కడక్కడా చిరుగులుపడ్డ అతని లుంగీ, చొక్కాల అసలు రంగేమిటో చెప్పటం ఎవరి తరమూ కాదు. వాటి నుండీ వస్తున్న వాసన కారంతా నిండిపోయి, నాకు కడుపులో వికారంగా అనిపించింది.

కాశ్యప్ మాత్రం ఇవేమీ పట్టని వాడిలా కళ్ళు మూసుకుని, ఏవో ఆలోచనలు చేస్తూ కూర్చుని ఉన్నాడు. వెంబడి బాస్ వస్తూ ఉండటం అతనికి చిరాకు కలిగించినట్లుంది. ఎందుకంటే ఆయన అక్కడ ఉన్నంతసేపూ, తను సిగరెట్ కాల్చేందుకు వీలుండదు.

# కూపస్థ మండూకం

కెమెరాలు, లయిట్లు అన్నీ సిద్ధంగా ఉన్నాయి, మేం వెళ్ళేసరికి. కారు దిగిన తర్వాత, కాశ్యప్ మళ్ళీ ఒకసారి జోగులుకి అతను ఏం చేయాల్సిందీ సూచనలిచ్చాడు.

తల వంచుకుని తప్పు చేస్తున్న వాడిలా బెదురుగా బార్బర్‌షాప్, గ్లాస్ తలుపు తోసుకుని, లోపలికి వెళ్ళాడు. అక్కడున్న బార్బర్ ఒకరు అతన్ని సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టాడు. తర్వాత ఇరవయి నిమిషాల సేపు హేర్ కటింగ్, షేవింగ్ జరిగాయి.

మధ్య మధ్యలో కాశ్యప్ సూచించినప్పుడల్లా కొన్ని క్షణాలు కెమెరాలు, లయిట్లు పని చేస్తున్నాయి.

వెనకాల కొంచెం దూరంలో బాస్ పక్కనే కుర్చీలో కూర్చుని చూస్తున్న నాకు, ఎదురుగా అద్దంలో జోగులు ముఖం కన్పిస్తోంది. చిన్న మీసకట్టు తప్పితే, నున్నగా నీడలు తేలేలా గీసిన గెడ్డం చక్కని క్రాఫ్ కటింగ్‌తో, ఆకర్షణీయంగా ఉంది జోగులు ముఖం.

బాస్ కూడా చాలా ఇంప్రెస్ అయినట్లు కనిపించారు. మైగాడ్ మంచి పర్సనాలిటేనే కాదు, చాలా ఫేర్ కాంప్లెక్షన్. ప్రొఫెషనల్ మోడల్స్‌ని మించేలా ఉన్నాడే'' అని గొణుక్కోవటం నా చెవుల పడంది.

తర్వాత సీన్ స్నానాల గదికి మారింది. ఆ కార్యక్రమం అయేసరికి, టబ్‌లో నీళ్ల రంగే పూర్తిగా మారిపోయింది. బొగ్గును పొడిగా చేసి, అందులో కలిపినట్లు కనిపిస్తోంది.

అక్కడినుండీ, టెయిలర్ షాప్‌లోకి మారేం. నిజానికి జోగులు కొలతలు, అన్నీ ముందే వాళ్ళదగ్గిరున్నాయి. వాటికి సరిపోయేలా బట్టలు కుట్టి కూడా ఉంచారు.

అప్పటికప్పుడు ఫిల్మ్‌కోసం, కొలతలు తీయటం, బట్టలు కత్తిరించటం, వాటిని కుట్టటం, కొన్ని సెకన్లపాటు ఫార్స్‌గా జరిగింది. కెమెరామెన్ తమ పని చేసుకుపోతున్నారు.

చివరకి తయారుగా ఉన్న బట్టలు ధరించాడు జోగులు. దానితో పూర్తిగా అతని అవతారమే మారిపోయింది. గంట క్రితం బార్బర్ షాప్‌లో అడుగు పెట్టిన వ్యక్తికీ, ఇతనికీ పోలికే లేదు.

మనిషి బాగా ఎత్తరి, దానికి తగ్గట్టుగా కొంచం కండలు తిరిగిన శరీరం, పచ్చని శరీర ఛాయ, జోగులుది. తుమ్మెద రెక్కలలాంటి మీసకట్టు, స్టైలుగా దువ్విన ఒత్తయిన జుట్టు, కూలింగ్ గ్లాసెస్, కనీసం వెయ్యి రూపాయలు అయినా ఖరీదు చేసే, ఎగ్జిక్యూటివ్ రకం సూటు, మాచింగ్ టై, షూతో, ఇప్పుడే ప్లేన్ దిగివస్తున్న, సినిమా హీరో లాగానో, పెద్ద వ్యాపారవేత్త లాగానో కనిపిస్తున్నాడు.

''మైగాడ్ ! ఎంత హాండ్‌సమ్‌గా ఉన్నాడు! నిజంగా కాశ్యప్‌ని అభినందించాల్సిందే'' అంటున్నారు బాస్.

'నిజమే' అనిపించింది నాకు.

షూటింగ్ అయిపోయింది. టెక్నీషియన్స్ సామానులన్నీ పాక్ చేస్తున్నారు.

టెయిలరింగ్ షాప్, హెడ్ టెయిలర్ మాకందరికీ డ్రింక్స్ తెప్పించి, మర్యాద చేస్తున్నాడు.

''బ్రంటే నీదేనోయ్ యంగ్‌మాన్ ! నీ కాంపెయిన్ సుపర్బ్‌గా ఉంది,'' అని సంతోషంగా కాశ్యప్‌ని మెచ్చుకున్నారు బాస్.

''నాదొక అయిడియా. చూడూ, ఆ మనిషి ఏం చేస్తుంటాడో తెలుసా నీకు ?''

''ప్రత్యేకించి ఇదీ అంటూ ఉద్యోగం లేదు. స్కూలంటే ఎలా ఉంటుందో కూడా అతను ఎప్పుడు చూసి ఉండకపోవచ్చు. ఇంతెందుకు, ఈ దేశంలో ఉన్న లక్షలాది అక్షరాస్య నిరక్షరాస్య నిరుద్యోగుల్లో ఒకడనుకోండి సర్'' అన్నాడు కాశ్యప్.

''మన ఆఫీస్‌లో అటెండర్‌గా ఉద్యోగం ఇద్దాం రమ్మను... అప్పుడప్పుడు మన కాంపెయిన్స్‌కి మోడల్‌గా కూడా పనికొస్తాడు'' అన్నారు బాస్. తన ఆలోచనకి తనే మురిసిపోతున్నవాడిలా కన్పించాడాయన.

## స్మృతి

ఒక్కోమారు ఆకాశాన్నంతా దాచుకొన్న
ఆ నీలి కన్నుల్లో ధారలు, వరదలు
మరోమారు ఆ నీలి కన్నుల్లోనే
ఆకాశాన్ని కాల్చే అగ్ని తాపాలు, పరితాపాలు

మరోనాటికే నూరేళ్ళు నిండుతున్నా
శిగ బంధంలో సౌందర్యాన్నతిశయిస్తాయి పూలు
కలకాలం కత్తుల వెతలతో వెళ్ళదీసేకన్నా
స్మృతి మధురమైతే బ్రతుకు ఒక్క క్షణం చాలు.

అవి కన్నులైనా, పువ్వులైనా
దృష్టికీ, సృష్టికీ రమణీయమే

కన్నులు వర్షిస్తే మనుగడ గుడ్డిదవుతుంది
పువ్వులు వత్తలైతే సృష్టి చిన్నబోతుంది.

– డాక్టర్ పి. వి. రమణ

ఆయన ముఖంలో కన్పిస్తున్న ఉత్సాహం కాశ్యప్ ముఖంలో కన్పించలేదు నాకు. ఎందుకూ పనికిరాకుండా, మురికివాడలో, మట్టిలో తాగి దొర్లుతూ పడిఉండే జోగులుకీ, మా ఆఫీస్‌లో నెలకి మూడు వందల జీతంతో ఉద్యోగం ఇవ్వటం నిజంగా బాస్ సహృదయాన్నే చాటుతోంది. దీన్నిబట్టి, జోగులు ఆయన మనసుని ఎంత బాగా ఇంప్రెస్ చేసిందీ అర్థం అయింది.

కానీ కాశ్యప్‌లో ఈ నిర్లిప్తత ఏమిటో నాకు అర్థం కాలేదు. "వై ? ఆర్‌యూ నాట్ హేపీ'' అని గుసగుసగా అడిగాను. కాశ్యప్‌ని. అతను నామాట విన్పించుకున్నట్లు లేదు.

'మారీ అండ్ టోనీ' కంపెనీ వారు బహుమతిగా ఇచ్చిన, తెల్లటి పైజమా, లాల్చీ వేసుకుని, జేబులో కాశ్యప్ ఇచ్చిన కొత్త రూపాయి నోట్లలో బయట కూర్చుని ఉన్న జోగులుని పిలుచుకొచ్చారు.

"ఏవోయ్, మా ఆఫీసులో ఉద్యోగం ఇస్తాం చేస్తావా ?''

"ఏంటి సార్. తమాషా చేస్తున్నారా ? నాకేమిటి ఉద్యోగమిస్తారా ?'' అని పడి పడి నవ్వేడు జోగులు.

"నిజంగానే జోగులూ. సార్ నీకు ఉద్యోగం ఇస్తామన్నారు. జీతం మూడు వందలిస్తారు. రేపొచ్చి చేరతావా ?'' అడిగాడు కాశ్యప్.

"ఓ తప్పకుండా బాబూ. నిజంగా మీ అయ్యగారు దేవుడిలాగున్నాడుగద సార్! చెయ్యెత్తి దండం బెట్టాల్సిందే. పని ఇస్తాం రమ్మంటే ఎందుకు రానూ ? రేపే వచ్చేస్తా. వెళ్ళొస్తా సార్''

అని మేనేజర్‌గారి కాళ్ళమీద పడినంత పనిజేసి, అందరికీ దండాలు బెట్టి, బయలుదేరాడు జోగులు.

* * *

రేపయింది. మరునాడయింది. జోగులు రానేలేదు. మేనేజర్‌గారు అడిగి అడిగి ఊరుకున్నారు.

"నువ్ తెచ్చిన జోగులు బొత్తిగా వింత మనిషిలా ఉన్నాడే, ఈ రోజుల్లో ఉద్యోగం ఇస్తాం రమ్మంటే ముఖం తప్పించే వాళ్ళెవరయినా ఉంటారా ?'' అన్నాను కాశ్యప్‌తో.

'మారీ అండ్ టోనీ' టి.వి. కమర్షియల్ తయారయింది. మా ఆఫీస్ స్టూడియోలో, ఫిల్మ్‌ని ప్రొజెక్ట్ చేయించి, చూస్తున్నాం నేనూ, కాశ్యప్.

"ఆవేళ ఆర్‌యూనాట్ హేపీ'' అని అడిగావు కదూ? నాకప్పుడే తెలుసు. బాస్ ఆఫర్ చేసినా, వాడు రాడని. నేనిచ్చిన డబ్బులన్నీ అయిపోయేదాకా వాడు సారాయి కొట్టు దగ్గరే మకాం వేసుంటాడు. వాడికి ఉద్యోగం చేసే యోగ్యత ఎక్కడుంది ?''

"అంతేనా ?''

"అంతే మరి ... మనం శుభ్రం చేసి, అలంకరించింది వాడి శరీరాన్ని గాని, మనసును కాదుగా ? అది ఎప్పటిలా మట్టికొట్టుకునే ఉంటుంది. దాన్ని శుభ్రం చేసి, మేకప్ చేయగల శక్తి మనకు ఉందనుకోను ... సోమరిపోతును బాగుచేసే శక్తి, వాణ్ని పుట్టించిన ఆ బ్రహ్మక్కూడా ఉండదు సుమా !'' అని అంటున్న కాశ్యప్ వయిపు అర్థం కాని దానిలా చూస్తూ ఉండిపోయాను.

★

# ఇ'వేమన'పద్యాలు




మాటలాడనేర్చి మనసు రాజిలచేసి
పరగ ప్రియము జెప్పి బడలకున్న
నౌకరి చేతిసొమ్ము లూరకె వచ్చువా
విశ్వదాభిరామ వినుర వేమ.